సాక్షి అనంతపురం

సోమవారం। 26। జూన్। 2023



జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. రాగల రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.



నేటి నుంచి రెండు పూటలా బడులు

ఎండలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నుంచి రెండుపూటల బడులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు.

గరిష్టం/కనిష్టం

35.6°/23.2°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో తగ్గిపోతున్న నీటి మట్టం



జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం తగ్గిపోయింది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో ఏమాత్రమూ లేదు. ఆదివారం నాటికి డ్యాంలో 2.88 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. ధర్మవరం కుడి కాలువకు రోజూ 154 క్యూసెక్కులు, అనంతపురం, సత్యసాయి, శ్రీరామరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లో లేనందున నీటి మట్టం తగ్గుముఖం పడుతూ వస్తోందన్నారు. తాగునీటి ప్రాజెక్ట్‌లకు నీటి కొరత లేదన్నారు. 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా చాలన్నారు.

అప్పిరెడ్డికి 'నాటా' పురస్కారం



అప్పిరెడ్డి హరినాథరెడ్డి

అనంతపురం కల్చరల్: నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) ఆధ్వర్యంలో అందించే సాహితీ పురస్కారానికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు నాటా అధ్యక్షుడు శ్రీధరరెడ్డి కోర్శిపాటి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30న అమెరికాలోని డల్లాస్‌లో జరిగే నాటా మహాసభల్లో అక్కడి ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డిని సాహిత్యభారతి ప్రతినిధులు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, శ్యామసుందరశాస్త్రి, రియాజుద్దీన్, రమేష్ తదితరులు అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం



అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీల పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగుల అంతర్ జిల్లాల బదిలీలకు రంగం సిద్ధమైంది. నగరపాలక సంస్థలో జరగనున్న బదిలీ ఏర్పాట్లను ఆదివారం కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు. అడ్మిన్, ఎడ్యుకేషన్, ఎమినిటీస్, ప్లానింగ్, వెల్ఫేర్, పారిశుద్ధ్య కార్యదర్శుల బదిలీలకు ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్, నూతన భవనంలో బదిలీలు జరగనున్నాయి.

160 మంది దరఖాస్తు..

అంతర్ జిల్లాల బదిలీలకు దాదాపుగా 160 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో స్పౌజ్, మ్యూచువల్‌కు 36 మందితో పాటు 120 మంది ఇతరులు, గతంలో జరిగిన బదిలీల్లో రిజెక్ట్ చేసిన నలుగురు ఉన్నారు. ఆరు కేటగిరీలకు సంబంధించి 10 మంది కమిషనర్లు బదిలీలు చేపట్టనుండగా మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షించనున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి సాధ్యమైనంత త్వరగా బదిలీలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

'ఖాతాదారులకు అన్యాయం చేయం'



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఖాతాదారులకు అన్యాయం చేయబోమని ఆదరణ చిట్‌ఫండ్స్ యాజమాన్యం తెలిపింది. ఆదివారం అనంతపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా సాగిస్తున్న చిట్ ఫండ్ వ్యాపారంలో డబ్బుకు బదులు హంపాపురం వద్ద వేసిన వెంచర్‌లో స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామన్నారు. 320 మంది ఖాతాదారులకు సొమ్ము చెల్లించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదిలా ఉండగా ఓ విశ్రాంతి ఉద్యోగి మాట్లాడుతూ.. తనకు ఇవ్వాల్సిన రూ.25 లక్షలపై సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏడాది కాలంగా కార్యాలయం చుటూ తిరిగి వేజారిపోయినట్లు తెలిపారు.

ఊళ్లోనే రిజిస్ట్రేషన్

- సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి
- మొదటి విడతలో 40 చోట్ల అమలు
- దశలవారీగా జిల్లా అంతటా విస్తరణ
- ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు



రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమైన డీ హీరేహాళ్ మండలం కాదలూరు సచివాలయం

అనంతపురం టౌన్: ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలకు శ్రీకారం చుట్టింది. స్థిరాస్తుల క్రయ విక్రయాలను ఇకపై ఎవరి సచివాలయ పరిధిలో వారు చేసుకునే వెసులుబాటు కల్పించింది. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 40 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే 27 సచివాలయల్లో రిజిస్ట్రేషన్ సేవలను తీసుకొచ్చింది. ఇందులో డీ.హీరేహాళ్ మండలంలో 11, కణేకల్లు మండలంలో ఏడు, బొమ్మనహాళ్ మండలంలో నాలుగు, రాయదుర్గం మండలంలో ఐదు సచివాలయాలు ఉన్నాయి. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, కుందుర్పి, కంబదూరు, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో ఒక్కొక్క సచివాలయం, పెద్దవడుగూరు మండలంలో నాలుగు, శెట్టూరు మండలంలో మూడు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు అనుమతి వచ్చింది. ఎంపిక చేసిన సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ విధానంపై దశలవారీగా శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు ఆయా రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, దేవదాయ భూముల వివరాల సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు. క్రయవిక్రయదారులకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వాటి వివరాలను పంపుతారు. దీంతో అక్కడి సబ్ రిజిస్ట్రార్ సేవల వివరాలను రికార్డులో పరిశీలించి నమోదు చేస్తారు. ఇంతటితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. నిర్దేశించిన సమయంలోగా వినియోగదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తారు.

15 రకాల సేవలు ఇవే...



రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన 15 రకాల సేవలను సచివాలయం ద్వారా పొందవచ్చు. భూముల రిజిస్ట్రేషన్, భూముల నకలు డాక్యుమెంట్లు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఈసీ, మ్యానువల్ ఈసీ, ఆర్‌హెచ్ (రైట్ టు హోల్డర్) పేజీ, బ్యాంకు తనఖాలు, అసోసియేషన్ల రిజిస్ట్రేషన్లు, 1933 – 53 మధ్య రిజిస్ట్రేషన్ నకలు పేజీలు, ఈ–స్టాంపింగ్‌తో పాటు మరో ఐదు రకాల సేవలు సచివాలయాలు అందిస్తాయి.

దశలవారీగా అన్ని సచివాలయాల్లో సేవలు



రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసింది. జిల్లాలో మొదటి విడత కింద 40 సచివాలయాలను ఎంపిక చేసింది. ఇందులో రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన 15 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. దీంతో వినియోగదారులు సైతం స్థానికంగానే సేవలను పొందుతున్నారు. రానున్న రోజుల్లో దశల వారీగా అన్ని సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఈ విధానంతో ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం అవుతాయి. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్

ఆర్‌ఐ విష్ణుపై సస్పెన్షన్ వేటు

అనంతపురం అర్బన్: భూ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతపురం రూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విష్ణుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని కమలానగర్‌లో నివాసముంటున్న తుమ్మల వంశీ ఈ నెల 16న ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కురుగుంట గ్రామ పొలం సర్వే నంబరు 102/113లో తన భార్య పేరున ఉన్న 5.68 ఎకరాల పొలాన్ని కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమదంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ వంశీ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. బెదిరింపులకు పాల్పడిన వారి పేర్లతో పాటు ఆర్‌ఐ విష్ణు పేరునూ తన సూసైడ్ నోట్‌లో ప్రస్తావించాడు. ఈ వ్యవహారంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ మధుసూదన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆర్‌ఐ విష్ణును సస్పెండ్ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం టౌన్: నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా సహాయ సంచాలకులు ఐజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ వికాస్ యోజనలో భాగంగా 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న యువతకు గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కోర్సులపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతోపాటు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం కింద బ్యాంకుల ద్వారా రుణసదుపాయాన్ని కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440814612 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అటెండర్‌పై పోక్సో కేసు నమోదు



ప్రిన్సిపాల్‌తో వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ

ఉరవకొండ: గురుకుల పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన అటెండర్ రామాంజనేయులుపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అటెండర్‌కు సహకరించిన సెక్యూరిటీ గార్డుపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ హరినాథ్ తెలిపారు. ఉరవకొండ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన లైంగిక దాడి ఘటనపై డీఎస్పీ నర్సింగప్ప, సీఐలు హరినాథ్, శేఖర్ ఆదివారం విచారణ చేపట్టారు. బాధిత విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులతో పాటు ప్రిన్సిపాల్ సునీత ఇతర ఉపాధ్యాయులను కలసి వివరాలు సేకరించారు. కాగా, విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన అటెండర్‌ను అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకుడు సురేష్, తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి చిన్నా అంజినేయులు, ఓబుళపతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డీఎస్పీని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఇదిలా ఉండగా రాత్రి 9 గంటల తర్వాత ఎస్పీ శ్రీనివాసరావు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పీటీఐల బదిలీ

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వివిధ స్కూళ్లలో పని చేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల (ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్) రిక్వెస్ట్ బదిలీలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. డీఆర్వో గాయత్రీదేవి, సమగ్ర ఏపీసీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. మొత్తం 43 మంది దరఖాస్తు చేసుకోగా...41 మంది హాజరయ్యారు. వీరిలో ఆర్ట్ ఎడ్యుకేషన్ 9 మంది, వర్క్ ఎడ్యుకేషన్ నలుగురు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆరుగురు బదిలీలు అయ్యారు. తక్కినవారు ప్రస్తుతం పని చేస్తున్న స్థానాల్లోనే కొనసాగుతారని ఏపీసీ తెలిపారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రియ, ఏఎంఓ హరికృష్ణ, అసిస్టెంట్ ఏఎంఓలు మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

సిమెంట్ దొంగలకు బిగుస్తున్న ఉచ్చు

- క్రిమినల్ కేసుల నమోదుకు రంగం సిద్ధం
- ఆదేశించిన శ్రీసత్యసాయి కలెక్టర్ అరుణ్‌బాబు
- నేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్న ఇంజినీరింగ్ అధికారులు
- పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించిన అనంతపురం కలెక్టర్
- సిమెంట్ పక్కదారి వ్యవహారంలో ఎవరినీ ఉపేక్షించొద్దని స్పష్టం చేసిన కలెక్టర్లు



రాప్తాడురూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనులకు కేటాయించిన సిమెంటును అక్రమంగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన వ్యవహారంలో అక్రమార్కుల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. సిమెంట్ దొంగల వ్యవహారాన్ని కలెక్టర్లు గౌతమి (అనంతపురం), అరుణ్‌బాబు (శ్రీసత్యసాయి జిల్లా) సీరియస్‌గా తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పనుల పేరుతో సిమెంట్ స్కాం చేసినా... ఇదంతా అనంతపురంలోని సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయం నుంచే నడిచింది. ఇరు జిల్లాల కలెక్టర్లు దీన్ని తీవ్రంగా పరిగణించారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. సిమెంట్ పక్కదారి వ్యవహారంలో ఏ స్థాయి ఉద్యోగి ఉన్నా ఉపేక్షించకూడదని, విచారణ పారదర్శకంగా చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్లు సమగ్ర శిక్ష ఏపీసీ సాయిరామ్, ఈఈ శివకుమార్‌లను ఆదేశించారు. విచారణలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు సైట్ ఇంజినీర్లు, ఆపైస్థాయి అధికారుల పాత్రపై పూర్తిగా దృష్టి సారించనున్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పక్కదారి పట్టిన ప్రభుత్వ సొమ్ములో ప్రతి రూపాయినీ రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు అనంతపురం జిల్లాలోనూ ఈ విధంగా ఏమైనా జరిగిందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

అప్పుడే 90 శాతానికి పైగా పనుల పూర్తి..

ఉమ్మడి జిల్లాలో 57 నాబార్డు స్కూళ్లు, 17 కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో వివిధ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించేనాటికి దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. 70కి పైగా లోడ్ల సిమెంట్ బుక్ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

లాగిన్ బ్లాక్..

శ్రీసత్యసాయి జిల్లా డీఈ, ఈఈ పేర్ల మీద వచ్చిన కొత్త లాగిన్లను తమవద్ద ఉంచుకుని సిమెంట్ బుక్ చేసుకున్న ఉద్యోగుల వ్యవహారం వెలుగుచూడగానే ఆ లాగిన్‌ను బ్లాక్ చేశారు. అధికారులు ఆ లాగిన్‌ను ఓపెన్ చేసేందుకు వీలుకాలేదు. అయితే సిమెంట్ సరఫరా చేసిన కంపెనీల నుంచి వివరాలు తెప్పించుకుంటే ఈ అవినీతి తతంగమంతా వెలుగు చూస్తుందని అధికారులు చెబుతున్నారు.

క్రీడా కెరటం కీర్తన





స్కూల్ గేమ్స్‌లో ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకున్న కీర్తనను అభినందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి (ఫైల్)

- సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న కీర్తన
- అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం: తన ముందున్న దారంతా కష్టాలు కనిపించాయి. అడుగడుగునా అవరోధాలు ఎదురయ్యాయి. ఎదుగుదలకు పేదరికం అడ్డుగోడలా మారింది. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. ప్రతిభను నమ్ముకుని ముందుకు కదిలి విజేతగా నిలిచింది. సాఫ్ట్‌బాల్‌లో శ్రీసత్యసాయి జిల్లా ఆశాకిరణమై కనిపిస్తున్న కీర్తన క్రీడా ప్రస్థానమిది. తాజాగా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఇటీవలే సొంతూరుకు తిరిగి వచ్చింది.

కష్టాలు.. కన్నీళ్లు..

నల్లచెరువు మండలం ఇందుకూరిపల్లికి చెందిన కీర్తన తల్లిదండ్రులిద్దరూ సన్నకారు రైతులే. చిరుప్రాయంలోనే తండ్రి ఎం.శ్రీనివాసరెడ్డి మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం మొత్తం తల్లి అనితపై పడింది. ఓ వైపు వ్యవసాయ పనులు సాగిస్తూనే మరో వైపు ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ భారాన్ని నెత్తికెత్తుకుంది. ఈ క్రమంలో చదువులు ఒక్కటే తమ పేదరికాన్ని దూరం చేస్తాయని విశ్వసించిన ఆమె.. ఆ దిశగా బిడ్డలను ప్రోత్సహిస్తూ వచ్చింది.

చదువులోనూ ఉన్నతమే.

కదిరిలోని బాలికల సంక్షేమ వసతి గృహంలో ఉంటూ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కీర్తన చదువుకుంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 468 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. 6వ తరగతిలో ఉన్నప్పుడే సాఫ్ట్‌బాల్ క్రీడపై కీర్తన ఆసక్తి కనబరుస్తూ వచ్చింది. సమయం చిక్కినప్పుడల్లా 9 అంగుళాల బంతిని చేత పట్టుకుని పిచ్చింగ్ సాధన చేస్తూ వచ్చింది. ఆమెలోని ప్రతిభను పీఈటీలు సంధ్య, దానమయ్య గుర్తించారు. ప్రత్యేక శిక్షణతో ఆమెలోని నైపుణ్యాలను వెలికి తీశారు.

అమ్మ అండదండలతో..

సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న కీర్తనను చూసి తల్లి అనిత సంతోష పడింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం చదువులు ఒక్కటే ఉన్నతికి మార్గం కాదని భావించిన ఆమె క్రీడల్లోనూ రాణించాలంటూ కుమార్తెను ప్రోత్సహిస్తూ వచ్చింది. తల్లి ప్రోత్సాహం దక్కడంతో కీర్తన ఇక వెనుదిరిగి చూడలేదు. తన ఆటతీరుతో ఆర్డీటీ దృష్టిని ఆకర్షించింది. దీంతో క్రీడలో ఆమె మరింత పరిపూర్ణత సాధించేలా ఆర్డీటీ ప్రత్యేక శిక్షణ అందజేసింది. ఫలితంగా ఆరో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడే అండర్–12 విభాగంలో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. తొలి ఏడాదిలోనే జాతీయ స్థాయికి ఎదిగిన ఆమె.. ఆ తర్వాత వరుస విజయాలతో తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోంది. 7వ తరగతి చదువుతున్నప్పుడు మధ్యప్రదేశ్‌లో జరిగిన మినీ నేషనల్స్, స్కూల్ గేమ్స్‌లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించింది. 2018లో అనంతపురంలో అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పిచ్చర్‌గా, స్లగ్గర్‌గా తనకు ఎదురు లేదని నిరూపించుకుంది. 2019లో అనంత క్రీడాగ్రామంలో జరిగిన స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లోను, 2021లో విజయనగరం వేదికగా జరిగిన 8వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో తన ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చింది. పదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు సీనియర్ విభాగంలో స్కూల్ గేమ్స్, సౌత్‌జోన్, అండర్–15 ఉమెన్స్ ఏషియన్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో పాల్గొంది. ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కీర్తన ఆట తీరు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది.



తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టుపై బ్యాటింగ్ చేస్తున్న కీర్తన (ఫైల్)

ఫలించిన శ్రమ..

నిరంతర సాధనతో సాఫ్ట్‌బాల్‌లో రాణిస్తున్న కీర్తనకు అన్ని విధాలుగా ఆర్డీటీ దన్నుగా నిలిచింది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆమెకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి మరింత మెరుగులు దిద్దింది. ఈ నెల 13 నుంచి 17 వరకు తైవాన్‌లో జరిగిన అండర్–15 ఆసియా ఉమెన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన కీర్తన తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించి జట్టును విజయ తీరాలకు చేరుస్తూ వచ్చింది. తనను ఉన్నతశ్రేణి క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన ఆర్డీటీకి జీవిత కాలం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా 'సాక్షి'కి కీర్తన తెలిపారు.

భద్రంగా పాతాళగంగ



బోరుబావి నుంచి సమృద్ధిగా వస్తున్న నీళ్లు


- వేసవిలోనూ స్థిరంగా జలాలు
- జిల్లా తాజా సగటు నీటి మట్టం 7.67 మీటర్లు
- వర్షం రూపంలో 276 టీఎంసీల నీటి ప్రవాహం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పాతాళగంగ భద్రంగా ఉంది. వేసవిలో భానుడు ఉగ్రరూపం దాల్చిన పరిస్థితుల్లో సైతం భూగర్భజలాలు స్థిరంగా ఉన్నాయి. 31 మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 97 పీజోమీటర్ల నుంచి భూగర్భజలశాఖ సేకరించిన తాజా గణాంకాలను పరిశీలిస్తే.. జిల్లా సగటు నీటి మట్టం 7.67 మీటర్లతో స్థిరంగా ఉంది. దాదాపు పాతికేళ్ల చరిత్ర తీసుకుంటే మంచి ఎండాకాలంలో ఈ స్థాయిలో భూగర్భజలాలు పైపైన ఉండటం ఇదే మొదటి సారి అని నిపుణులు చెబుతున్నారు.

276 టీఎంసీల వర్షం..

మే ఆఖరుతో ముగిసిన వర్షపాత సంవత్సరంలో 512.5 మి.మీ సాధారణానికి గాను 50 శాతం అధికంగా అంటే 766 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం రూపంలో 276 టీఎంసీల నీటి ప్రవాహం కొనసాగింది. ఒక టీఎంసీ అంటే 2,831 కోట్ల లీటర్లు అన్నమాట. ఇందులో 33 టీఎంసీల నీళ్లు ఎక్కడికక్కడ భూమిలో ఇంకిపోగా మిగతాది ప్రవాహం రూపంలో కొనసాగింది. క్రమం తప్పకుండా భారీ వర్షాలు నమోదు కావడం, హెచ్చెల్సీ, హంద్రీ–నీవా ద్వారా చెరువులు నింపడంతో నీటి ఇబ్బందులు ఏర్పడలేదు. నాలుగేళ్ల కిందట వరకు వర్షాలు లేక నెర్రెలు చీలిన చెరువులు, పగుళ్లు బారిన కుంటలు, బీడుపడిన భూములు, ఉపాధి కోసం వలస వెళ్లే ప్రజలతో 'అనంత'లో కరువు ఛాయలు స్పష్టంగా గోచరించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కొలువుదీరిన తర్వాత ప్రకృతి సహకరించడం, వరుణుడు కరుణిస్తుండటంతో 'అనంత' రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి.

38 శాతం నీటి వాడకం



ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాల లభ్యత 39 టీఎంసీలు ఉండగా.. అందులో 38 శాతం అంటే 15 టీఎంసీలు వినియోగించారు. మిగతా 24 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. యల్లనూరు మండలంలో మాత్రమే పరిమితికి మించి భూగర్భజలాలను వాడుతుండటంతో రెడ్‌జోన్ జాబితాలోకి చేరింది. మిగతా 30 మండలాలు సురక్షిత జాబితా (సేఫ్‌జోన్)లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.88 లక్షల వరకు బోరుబావుల నుంచి సమృద్ధిగా నీళ్లు వస్తుండగా, 12 గ్రామాలు మాత్రమే 'వాల్టా' పరిధిలో ఉన్నాయి.

– కె.తిప్పేస్వామి, డీడీ, భూగర్భజలశాఖ

క్రికెట్ విజేత ఇటుకలపల్లి

- ముగిసిన సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ
- పాల్గొన్న 190 జట్లు
- ఉత్కంఠగా సాగిన ఫైనల్



ట్రోఫీతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇటుకలపల్లి, సీకేపల్లి క్రీడాకారులు



మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు, ప్రజలు

అనంతపురం: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 30 రోజులుగా కొనసాగిన సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా ఇటుకలపల్లి జట్టు నిలిచింది. మొత్తం 190 జట్లు పాల్గొన్న ఈ టోర్నీని నిర్వాహకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వచ్చారు. మే 23న ఎస్కేయూ వేదికగా టోర్నీ ప్రారంభమైంది. వరుసగా మ్యాచ్‌లు గెలుస్తూ ఫైనల్‌కు అనంతపురం జిల్లా ఇటుకలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి (సీకే పల్లి) జట్లు చేరుకున్నాయి.

కిక్కిరిసిన ఆర్డీటీ స్టేడియం..

గతంలో ఎన్నడూ లేనంతగా క్రికెట్ మ్యాచ్ చూసేందుకు తరలి వచ్చిన సందర్శకులతో ఆర్డీటీ ప్రధాన స్టేడియం ఆదివారం కిక్కిరిసింది. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. తొలుత టాస్ గెలిచి చెన్నేకొత్తపల్లి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేసిన ఇటుకలపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చెన్నేకొత్తపల్లి జట్టు కేవలం 3.3 ఓవర్లలోనే 16 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అదే సమయంలో వర్షం రావడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. చివరకు రన్‌రేట్‌ను లెక్కించి ఇటుకలపల్లి జట్టును విజేతగా ప్రకటించారు. చెన్నేకొత్తపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన క్రీడాభిమానులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భోజన వసతి కల్పించారు.

క్రీడాస్ఫూర్తిని చాటిన టోర్నీ..

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 30 రోజుల పాటు కొనసాగిన ఈ టోర్నీ క్రీడా స్ఫూర్తిని చాటిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మెగా టోర్నీ నిర్వహించినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. టోర్నీని చక్కగా నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం

- ఎంపీ తలారి రంగయ్య



మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

గార్లదిన్నె: పేదల సొంతింటి కలను జగన్ సర్కార్ సాకారం చేసిందని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం గార్లదిన్నెలోని జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ గౌతమితో కలసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు భద్రత కల్పించేలా వారి పేరుపైనే ఇంటి పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసి, పక్కా గృహాలను నిర్మించి ఇస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటివద్దకే 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఆర్డీఓ మధుసూదన్, మండల అధికారులు, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు ఆర్యవైశ్యుల అండ

- ఎమ్మెల్సీ పోతుల సునీత



సన్మానం అందుకున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, సురేష్ దంపతులు

అనంతపురం కల్చరల్: ప్రజా సంక్షేమమే ఊపిరిగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్యవైశ్యులు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత స్పష్టం చేశారు. అనంతపురంలోని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని సందర్శించిన ఆమెను ఆర్యవైశ్య ప్రముఖులు ఘనంగా సన్మానించారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత అన్ని వర్గాలతో పాటూ ఆర్యవైశ్యులకూ సముచిత న్యాయం జరుగుతోందన్నారు. అంతకు ముందు ఇటీవల మరణించిన ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జయం పురుషోత్తం సంతాప సభలో ఎమ్మెల్సీ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతుల సురేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, రాంకుమార్, టి.నాగభూషణం, మల్లికార్జున, నాగరత్నం, క్రిష్ణం రఘు, జయం సురేష్, తల్లం మురళి, పి.రమేష్‌కుమార్, వంకదారి వెంకటేశ్, వెంకటకృష్ణ, ఆదర్శకుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికుడి మృతి



మృతుడు మహదేవ

గుత్తి: కర్ణాటక బస్సులో ప్రయాణికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహదేవ (29) బెంగళూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం కర్ణాటక బస్సులో బెంగళూరు నుంచి ఆదోనికి బయలుదేరాడు. గుత్తి సమీపంలోకి బస్సు చేరుకుంటుండగా ఒక్కసారిగా సీటులోనే జారి కిందపడడంతో బస్సు డ్రైవర్, కండక్టర్ నేరుగా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుత్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీఆర్టీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాప్తాడు రూరల్: కేజీబీవీల్లో ఎస్‌ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీలో భాగంగా సీనియార్టీ జాబితాలోని అభ్యర్థుల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం పూర్తయింది. వీరిలో కొన్ని సబ్జెక్టులకు అభ్యర్థులు గైర్హాజరు కావడం, మరికొందరికి అర్హత లేకపోవడం వల్ల తొలిగించారు. వారి స్థానాల్లో సీనియార్టీ జాబితాలో వారి దిగువన ఉన్న అభ్యర్థులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం కూడా ఈ ప్రక్రియ సాగనుంది. సర్టిఫికెట్ల పరిశీలనను సమగ్ర శిక్ష ఏపీఓ సాయిరామ్ పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 280 ఎస్‌ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రతి పోస్టుకూ 1:3 నిష్పత్తిలో అభ్యర్థులు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

కార్తికేయునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలతో పాటు రాహు కేతు హోమాలు, కాలసర్పదోష కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి పల్లకీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షిణలు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి అభిషేకాలు, పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

నేడు స్పందన

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగరపాలక సంస్థలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నప్పటికీ స్పందన యథావిధిగా కొనసాగుతుందని, నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన



నగరంలో సాగుతున్న సాయి భిక్షాటన

అనంతపురం కల్చరల్: స్థానిక మూడవరోడ్డులోని షిరిడిసాయిబాబా మందిర నిర్వాహకులు, భక్తులు సాయి చిత్రపటంతో ఆదివారం జోలె పట్టి భిక్షాటన చేశారు. ఇంటింటికీ వెళ్లి వచ్చేనెల 3న జరగనున్న గురుపౌర్ణమి అన్న ప్రసాద వితరణలో భాగస్వాములు కావాలని కోరారు. నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి 3 వరకు మందిరంలో సాయిసచ్చరిత్ర పారాయణం, సామూహిక సాయి సత్యదేవుని వ్రతాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. అంతకు ముందు సాయినాథునికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు వెంకట శివానంద, రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్యాధికారులను మేయర్ వసీం ఆదేశించారు. ఆదివారం నగరంలో భారీ వర్షం కురవడంతో మరువ, నడిమివంక పరిస్థితులను మేయర్ వసీం ఆరా తీశారు. భారీ వర్షంతో మరువవంకలో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయిన విషయాన్ని మేయర్ తెలుసుకున్నారు. పాత త్రివేణి థియేటర్ వద్ద ఉన్న మరువవంకలో జేసీబీ ద్వారా వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ గంగాధర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం ఆ పనులను మేయర్ స్వయంగా పరిశీలించారు. జనశక్తి నగర్‌లోనే అదే పరిస్థితి కన్పించడంతో అక్కడ చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓను ఆదేశించగా, ఆయన ఆ పనులను పూర్తి చేశారు. అనంతరం 3, 4, 5 రోడ్లలో మేయర్ పర్యటించారు. మేయర్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బండి శ్రీకాంత్ తదితరులున్నారు.

దేవరకొండ సేవలు అభినందనీయం



అవార్డునందుకుంటున్న దేవరకొండ కౌసల్య

అనంతపురం కల్చరల్: గోసేవలో నిత్యం పాల్గొనడమేకాకుండా అనేక మందిని చైతన్యవంతం చేస్తున్న దేవరకొండ కౌసల్య అభినందనీయమని తెలుగు వెలుగు జాతీయ సంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం గుంటూరులో ఘనంగా జరిగింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల వారికి జాతీయ పురస్కారాలు అందించారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన కౌసల్యకు డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు బీజేపీ నేత చందు సాంబశివరావు, డాక్టర్ బాల బ్రహ్మాచారి, శ్రీలక్ష్మి తదితరులు అవార్డునందించి సత్కరించారు.

ఓల్డ్ ఈజ్ గోల్డ్



ఒకటో తరగతి నుంచి గ్రూప్స్ వరకు ఏ పుస్తకం కావాలన్నా అర్ధ రేటే. అందుకే ఆదివారం వచ్చిందంటే చాలు నగరంలోని ఆర్ట్స్‌కాలేజీ, సుభాష్‌రోడ్, సప్తగిరి సర్కిల్ ప్రాంతాల్లో పుస్తక ప్రియుల సందడి నెలకొంటుంది. కొన్ని రకాల పుస్తకాలు మార్కెట్‌లో దొరక్కపోయినా ఇక్కడ మాత్రం సులువుగా లభిస్తాయి. స్కూళ్లు, కాలేజీలు కూడా తెరవడంతో పుస్తకాల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ఆయా ప్రాంతాలకు వెళ్లి వారికి కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. పాత పుస్తకాలైనా సరే తమకు కావాల్సిన పుస్తకాలు అర్ధరేటుకే లభిస్తుండటంతో పుస్తక ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం



పాత పుస్తకాలను విక్రయిస్తున్న దృశ్యం



పుస్తకాలను కొనుగోలు చేస్తున్న జనం



సప్తగిరి సర్కిల్ దగ్గర ఇలా..



పుస్తకాన్ని పరిశీలిస్తున్న విద్యార్థిని



పుస్తకాలతో విద్యార్థిని

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ రమణారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా కార్యదర్శులు, వలంటీర్లతో కమిషనర్ మాట్లాడారు. ఈ నెలాఖరులోపు ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న 11 ఉచిత సేవల గురించి వివరించాలన్నారు. వారి నుంచి ఫిర్యాదులు, వివరాలను డాక్యుమెంట్ రూపంలో సేకరించాలన్నారు. వచ్చే నెల 1 నుంచి ఈ బృహత్తర కార్యక్రమం మొదలవుతుందన్నారు. తొలిరోజు నగరంలోని 26వ సచివాలయంలో 25, 26, 27, 28 సచివాలయాలకు సంబంధించి, అలాగే టవర్‌క్లాక్ వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 22, 23, 24 సచివాలయాలకు, మహాత్మాగాంధీ కాలనీలోని 1, 2 సచివాలయాలకు 2వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను తెలియజేయగానే జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన లాగిన్‌లో పొందుపరుస్తామన్నారు. యూజర్ చార్జీలు చెల్లించాల్సిన పని లేకుండా ఉచితంగా సేవలందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

డీహెచ్ఈఓగా గంగాధర్

అనంతపురం క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని డెమో విభాగంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీహెచ్ఈఓ)గా గంగాధర్ నియమితులయ్యారు. నంద్యాలలో ఉన్న ఆయన బదిలీపై ఆరోగ్యశాఖకు వచ్చారు. గతంలో ఆయనకు డెమో విభాగంలో పని చేసిన అనుభవం ఉంది.

తరిమెల అమరనాథరెడ్డి శైలి విభిన్నం



టైంపాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: అనంత సాహితీరంగంలో తరిమెల అమరనాథరెడ్డి శైలి విభిన్నమని, ఆయన రక్తదాన సేవలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని వక్తలు కొనియాడారు. మానవతా సంస్థ కన్వీనర్, సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి రచించిన 'టైంపాస్–2' పుస్తకావిష్కరణ ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో జరిగింది. డాక్టర్ ప్రసూన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక సమీక్షకులుగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, సామాజిక సేవా కార్యకర్తలు విజయభాస్కర్, మానవతా సంస్థ కో కన్వీనర్ సలీం మాలిక్, రెయిన్‌బో హోం సద్దాం బాషా, నవీన్‌కుమార్ తదితరులు మాట్లాడారు. దశాబ్దాలుగా రక్తదాత అంటే గుర్తొచ్చే పేరుగా అమరనాథరెడ్డి ముందు వరుసలో ఉండడం అభినందనీయమన్నారు. ఆయన రచనలు సామాన్య పరిభాషలో అందరినీ ఆలోచింపజేసేలా, హాయిగా నవ్వించేలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా, సీనియర్ కవులు నబీరసూల్, రియాజుద్దీన్, డాక్టర్ షరీఫ్, నాగేంద్ర, శశికళ, ఆశ్రయ వృద్ధాశ్రమం కృష్ణారెడ్డి, చెట్ల ఈరన్న, సమాచార హక్కు చట్టం అధ్యక్షులు హొన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిందనుకున్న చిన్నారిలో కదలికలు

- జీజీహెచ్‌లో చేర్పించిన కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం: మరణించిందనుకున్న ఓ చిన్నారిని సొంతూరికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఉన్నట్టుండి గుండెచప్పుడు విన్పించింది. దీంతో కుటుంబ సభ్యులు అనంతపురం సర్వజనాస్పత్రిలో చేర్పించారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం వై.కొండపల్లికి చెందిన పి.లేఖ్యరెడ్డి(7)కి వారం రోజుల కిందట జ్వరం రావడంతో తండ్రి నవీన్ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించారు. డెంగీ జ్వరం ఉందని, మెరుగైన చికిత్స కోసం వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సిఫారసు చేశారు. దీంతో ఈ నెల 18న బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు పరీక్షించి డెంగీతో పాటు చిన్నారి తలకు ఇన్‌ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఇక పాప బతకడం కష్టమని తేల్చిచెప్పేశారు. అదే సమయంలో కదలికలు లేకపోవడంతో బిడ్డ చనిపోయిందని భావించిన తల్లిదండ్రులు ఆదివారం వాహనంలో తీసుకుని సొంతూరికి బయలుదేరారు. రాప్తాడు వద్ద వస్తుండగా చిన్నారి గుండె చప్పుడు విన్పించింది. దీంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి గుండె చప్పుడు, శ్యాచురేషన్ ఉండడంతో చిన్న పిల్లల వార్డులోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో వెంటిలేటర్‌పై ఉంచారు. హార్ట్‌బీట్ 80, శ్యాచురేషన్ 98 ఉందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసుగా పరిగణించి చికిత్స అందిస్తున్నామని డాక్టర్ శంకర్‌నారాయణ తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



వైద్య శిబిరం ప్రచార రథం ముందు రోటరీ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: రోటరీ క్లబ్, రోటరీ సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. ఉదయం స్థానిక కమలానగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, సెంట్రల్ అధ్యక్షులు భవానీ రవికుమార్, మాజీ అధ్యక్షులు అప్పా సుధీర్, సక్షం సంస్థ వేణుగోపాల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు శేషాంజనేయులు మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో అనేక ఏళ్లుగా కంటి వైద్యమందిస్తున్నామన్నారు. వందలాది మందికి ఉచిత ఆపరేషన్లతో పాటు వారికి రవాణ ఖర్చులు కూడా భరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో తరలి వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

అంతిమ సంస్కారాలకు సంజీవని చేయూత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంజీవని బృందం

అనంతపురం కల్చరల్: 'మనిషి జీవితంలో అంతిమ సంస్కార ఘట్టం కీలకం.. అందులో చాలా మందికి అంత్యక్రియలకయ్యే ప్రక్రియ ఇబ్బందిగా ఉంటుంది.. అటువంటి వారికి సంజీవని అండగా ఉంటుంది' అని సంజీవని చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వీవీ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని సంజీవని కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటూ సీనియర్ కవి మధురశ్రీ, సూర్యరాజు, ఆదినారాయణ మాట్లాడుతూ అంతిమ సంస్కార సమయంలో వైకుంఠ రథం, మృతదేహాలను పూడ్చడానికి అయ్యే ఖర్చులను తామే భరిస్తామన్నారు. నిరుపేదలు, అంత్యక్రియలు భారమని వేదన పడేవారు తమను సంప్రదించాలని కోరారు. వివరాలకు 9440476651 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే అన్నార్థుల వద్దకే నిత్యం ప్రత్యేక వాహనం ద్వారా అన్నదాన సేవలందిస్తున్నామని తెలిపారు.

గంగమ్మా.. కరుణించమ్మా !



పూజలందుకున్న గంగమ్మ తల్లి



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



కోలాటం ఆడుతున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదర్శనగర్‌లో వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల జాతర కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన బెస్తలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ప్రాచీన కళారూపాల ప్రదర్శనతో పాటు భక్తిగీతాలనాలపిస్తూ అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో బెస్త సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ లక్ష్మీనారాయణ, పామిడి శీను, గువ్వల గంగాధర్, నాగరాజు, భాస్కర్, రమేష్ , నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేద రైతులందరికీ ఉచిత బోర్లు



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



బోరులో పడిన నీరును చూపుతున్న పంపనూరు రైతులు

కనగానపల్లి: తోపుదుర్తి ట్రస్టు సహకారంతో గ్రామాల్లో పేద రైతులందరికీ ఉచితంగా బోర్లు వేయిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. నరసంపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు నాయకులతో కలసి ఆయన ఉచిత బోర్లు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జలకళ కార్యక్రమం ద్వారా అనేక మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. అయితే రాప్తాడు నియోజకవర్గంలో చాలా మంది రైతులు దరఖాస్తు చేసుకోవటంతో, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తన డబ్బుతో తోపుదుర్తి ట్రస్టు ద్వారా పేద రైతులందరికీ ఉచితంగా బోర్లు వేయిస్తున్నారన్నారు. వీటిని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయ పంటలు సాగు చేసుకొని జీవనోపాధిని పెంపొందించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, రమణారెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, ఆలమూరప్ప, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సాయం మరువలేనిది

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రైతులకు చేస్తున్న సాయం ఎప్పటికీ మరువలేనిదని పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, రైతులు తెలియజేశారు. పంపనూరులో ఇప్పటికే చాలా బోర్లు వేశారని అందరికి సమృద్ధిగా నీరు పడ్డాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం బాలరాజు అనే వ్యక్తి పొలంలో బోరు వేయగా మూడు ఇంచుల నీరు పడంతో ఆనందం వ్యక్తం చేశాడు. ఇంత వరకు ఏ నాయకుడు సొంత డబ్బు ఖర్చు పెట్టి రైతులకు ఆదుకోలేదని, ప్రకాష్‌రెడ్డి మాత్రం ఉచిత బోర్లు వేయిస్తూ వందల సంఖ్యలో రైతులకు అండగా నిలుస్తున్నారని తెలియజేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు.

రాయచూరు వాసి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కర్ణాటకలోని రాయచూరుకు చెందిన ధర్మేంద్ర(50) అనంతపురం నగర శివారులోని జీపీఆర్ లాడ్జీలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిన్న చిన్న కాంట్రాక్టు పనులతో జీవనం సాగించే ధర్మేంద్రకు అనంతపురంలోని రంగంపేట గోపాలరెడ్డి మిత్రుడు. ఈ నేపథ్యంలో మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఆయన తపోవనం కూడలిలో ఉన్న లాడ్జీలో దిగాడు. ఆదివారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లిన ఆయన తిరిగి బయటకు రాకపోవడంతో బాయ్‌లు అనుమానంతో తలుపు తట్టి నిద్రలేపే ప్రయత్నం చేశారు. తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి యజమాని ద్వారా పోలీసులకు సమాచారం అందజేశారు. నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద 'నా ఆస్తి నా భార్యకే చెందాలి'అని రాసిపెట్టిన ఉత్తరం లభ్యమైంది. సమాచారం అందుకున్న మృతుడి భార్య తాము వచ్చేంత వరకూ మృతదేహాన్ని అక్కడి నుంచి కదలించరాదని అభ్యర్థించింది. బాధిత కుటుంబసభ్యులు వచ్చిన తర్వాత ఆత్మహత్యకు కారణాలు వెల్లడయ్యే అవకాశముందని సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠకులతో గ్రంథాలయ నిర్వహణ, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సెస్సు సక్రమంగా చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన మమత

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామంలో ఓ వివాహిత విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన మమత(30) భర్త సురేష్‌తో కలిసి కూలీ పనులు చేసుకుని జీవనం గడపుతుండేది. ఆదివారం తన ఇంటిలో విషద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త , ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ముగిసిన జగన్నాథ రథోత్సవం



జగన్నాథుడికి మహా ప్రసాదాన్ని నివేదించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: రెండు రోజులుగా సందడిగా సాగిన జగన్నాథ రథోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఇస్కాన్ మందిరంలో బలరామ, సుభద్ర సమేత జగన్నాథుల ప్రతిమలకు విశేష పూజలు, మహానైవేద్య సేవలు జరిగాయి. ముఖ్యంగా రాజమండ్రి నుంచి తెప్పించిన ప్రత్యేక వంటకాలను జగన్నాథునికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన తర్వాత భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు మాట్లాడుతూ పూరీ క్షేత్రానికి వెళ్లి దర్శించుకోలేని వారికి అనంతలో ఇస్కాన్ మంచి అవకాశం కల్పించిందన్నారు. రథోత్సవ వేడుకల్లో భాగంగానే ధర్మవరంలో ఇస్కాన్ మందిర ప్రారంభానికి షెడ్డు నిర్మాణం జరిగిందని అనంత, సత్యసాయి జిల్లాల్లో ఇస్కాన్ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. రాత్రి రాధాపార్థసారధులకు ఊంజల సేవ నిర్వహించారు. ముగింపు వేడుకల్లో టీటీడీ ధార్మిక ప్రచార మండలి అధ్యక్షులు శ్రీపాద వేణు, గోశాల నిర్వాహకులు సుధీర్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లాలో రౌడీషీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం వన్‌టౌన్‌లో 138 మంది, నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్‌లో 135, రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో 38 మందికి గాను ఏడుగురికి, , త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో 32 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పద్ధతి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రధానంగా కిరాయి హత్యలు, డబుల్ మర్డర్ కేసుల్లో ఉన్న ముద్దాయిలుగా ఉన్న వారిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో దందాలు, దొమ్మీలు, దౌర్జన్యాలకు తెగబడితే తగిన శైలిలో బుద్ధి చెబుతామన్నారు. రౌడీషీటర్ల కదలికలు, వారి రోజువారి కార్యకలాపాలను షీట్లలో నమోదు చేశారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

రాప్తాడు: గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్‌లో ఆదివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, ఇతర నేరస్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం స్థానిక గ్రామస్తులతో బహిరంగ సమావేశం నిర్వహించి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా, నా కక్షిదారుడైన **ఎ. జయరామిరెడ్డి తండ్రి ఎ. అప్పిరెడ్డి, డోర్ నెం. 6-1-660, కోవూర్ నగర్, అనంతపురము** అను వ్యక్తి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై, అనంతపురము జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై, ఆంధ్రప్రదేశ్ హై కోర్టులో C.M.A. 288/2007 కేసు దాఖలు చేసినారు. ప్రస్తుతం ఆ కేసు హై కోర్టులో పెండింగు నందు వున్నది. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎవరైనా నా కక్షిదారునికి వ్యతిరేకంగా ఎటువంటి లావాదేవీలు జరిపినా, అవిచెల్లనేరవు, అట్టి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురము జిల్లా, రుద్రంపేట పంచాయితీ కక్కలపల్లి గ్రామ పొలంలోని ఆస్తి వివరం.

సర్వే నెం. 70, విస్తీర్ణం : 1-10 సెంట్లు (ఒక ఎకరా పది సెంట్లు) ఇందుకు చెక్కుబంది : తూర్పు : హరిజన కాలనీ; **పడమర :** 30 అడుగుల రోడ్డు; **ఉత్తరం :** డి-మార్ట్ వెనుక ఇల్లు; **దక్షిణం :** కురుబ కిష్టప్పవాండ్ల ఇల్లు.

ఈ మధ్య గల ఒక ఎకరా పదిసెంట్లు భూమి.

రాచమల్లు హరినాథరెడ్డి

న్యాయవాది, అనంతపురము. సెల్ : 9440333454